క్లుప్తంగా

పానుగోడు విద్యార్థికి ఐఐటీ పట్నాలో సీటు


సుందరి కృష్ణ

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామానికి చెందిన సుందరి సురేష్ కుమారుడు సుందరి కృష్ణ ఐఐటీ పట్నాలో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో ప్రజలు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుందరి శ్రీనివాస్, సుందరి కీర్తన్, సుందరి కోటేశ్వర రావు, గోపిరెడ్డి, సైదిరెడ్డి, వెంకన్న, చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.25 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపట్టబోయే కల్యాణ మండపం నిర్మాణానికి హుజూర్‌నగర్‌కు చెందిన తుడపనూరి శేఖర్ విజయలక్ష్మి దంపతులు సోమవారం నడిగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిరిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకన్న, వందనపు దయాకర్ పాల్గొన్నారు.

3న మహిళలకు ఆరోగ్య అవగాహన శిబిరం

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆగస్టు 3న వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఆరోగ్య అవగాహన శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య కోరారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మహిళలు గర్భకోశ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజయవాడకు చెందిన డాక్టర్ మాదవి రవీంద్ర బృందం అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

పాస్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

నడిగూడెం : మండల కేంద్రంలోని యేసుక్రీస్తు ఆశీర్వాద ప్రార్థన మందిరంలో సోమవారం మండల స్థాయి పాస్టర్ల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసాని యేసురత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా బాలసుబ్రహ్మణ్యం, జయరాజ్, జనరల్ సెక్రటరీగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జ్ఞానరత్నం, కార్యవర్గ సభ్యులుగా జాన్‌మార్క్, జాబేజు, జాన్‌వెస్లి, సుధాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కోదాడకు చెందిన సీనియర్ నాయకులు లూకాకుమార్, జి.ఆర్.అబ్రహం, ప్రభుదాస్, శ్రీనివాస్‌గౌడ్, నెహెమ్యా, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మునగాల : మునగాల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, నియోజకవర్గ నాయకుడు ఉప్పల మల్లేష్ ఉన్నారు.

4న లాండ్రీ షాప్ యూనియన్ సభ్యుల సమావేశం


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వచ్చే నెల 4వ తేదీన పట్టణ లాండ్రీ షాప్ యూనియన్ సభ్యుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వడ్లానపు శ్రీను తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ రజక యూనియన్ ఆధ్వర్యంలో సమావేశ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రజకుల సమస్యలు చర్చించి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రజకులు, లాండ్రీ షాప్‌ల వారు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఎ.ఉపేందర్, ఐ.నరసయ్య, వి.నరసింహారావు, ఐ.రాంబాబు, డి.నరసింహారావు, ఐ.పిచ్చయ్య, ఏ.మధు, ఏ.అంజి, శివ, ఐ.శ్రీను, ఏ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టులో కూలీల కొరత

- ఆలస్యమవుతున్న వరి నాట్లు
- ముదిరిపోతున్న నార్లు
- ఆందోళనలో రైతన్నలు


మునగాలలో నాటుకు సిద్ధంగా ఉన్న వరి నారుమడి


ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

మునగాల : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఆయకట్టు ప్రాంతమైన మునగాల మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు కూలీల కొరత వేధిస్తోంది. ఈ యేడు వర్షాలు సకాలంలో కురవడంతో ఆయకట్టులో వరిసాగు గణనీయంగా పెరిగింది. కానీ రైతాంగానికి కూలీల కొరత ఏర్పడింది. నానాటికి వరినాట్లు వేసే కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో కూలీల కొరతకు ప్రధాన కారణంగా భావించవచ్చు. ఇప్పటికే పలు గ్రామాల్లో పలువురు రైతులు డ్రమ్‌సీడర్, వరి విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కువ శాతం రైతులు వరి నాట్లు వేసేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో వరి నాట్లకు కూలీలు దొరకడం లేదు.

పెరిగిన వరినాట్ల కూలి..

గతంలో ఎకరం పొలం నాటు వేస్తే రూ.మూడు వేలు ఉండేది. ప్రస్తుతం అది రూ.3,500లకు పెరిగింది. దీనికి తోడు కూలీలు ముఠాపరంగా కాకుండా విడిగా వస్తే ఒక్కో కూలీకి రూ.500ల కూలి డిమాండ్ చేస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ఎకరాకు అదనంగా రూ.500ల భారం పడుతోంది. అయినప్పటికీ సకాలంలో కూలీలు దొరకకపోవడంతో వరినాట్లు ఆలస్యమవుతున్నాయిని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. వరినార్లు ముదిరిపోతున్నాయని ఫలితంగా దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన కల్పించాలి..

వరి సేద్యంలో వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్ పద్ధతితో సాగు విధానాలపై రైతాంగానికి వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా సబ్సిడీపై డ్రమ్‌సీడర్ పరికరాలను అందజేస్తే ఎక్కువ మంది రైతులు వినియోగించే అవకాశం ఉంది.

కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నాం



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరినాట్లు వేసేందుకు కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నాం. కూలి రేట్లు పెరిగినప్పటికీ సకాలంలో కూలీలు దొరకకపోవడంతో వరినాట్లు ఆలస్యమవుతున్నాయి. నాకున్న పది ఎకరాలతో పాటు మరో పది ఎకరాలను కౌలుకు చేస్తున్నాను. కూలీలు దొరకకపోవడంతో 15 ఎకరాల నాట్లు పూర్తి కాలేదు.

– తూముల వీరస్వామి, రైతు, మునగాల

అసెంబ్లీ ముట్టడిని జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి

మునగాల : విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన నిర్వహించ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడిని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి కోరారు. సోమవారం మునగాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 7.31 శాతం మాత్రమే కేటాయించిందన్నారు. పదకొండు వర్సిటీలకు రూ.500 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ ఉస్మానియాకు రూ.100 కోట్లు, మహిళా విశ్వవిద్యాలయానికి రూ.100 కోట్లు మిగిలిన అన్ని యూనివర్సిటీలకు రూ.300 కోట్లు కేటాయిచండం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను ప్రోత్సహించే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసి ప్రజలను పాలకవర్గాలు బానిసలను చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నేటికీ మౌలిక వసతి సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వినయ్, మహేష్, పవన్, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి


మాట్లాడుతున్న మాలోతు బాలునాయక్

మఠంపల్లి : ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తెల్లరేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ కోరారు. సోమవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు నిత్యం పీఏసీఎస్ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులందరికీ రూ.లక్ష రుణ మాఫీ చేసి అనంతరం లక్షన్నర, రెండు లక్షలు మాఫీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నాయకులు సయ్యద్‌రస్ మియా, కంటు కోటయ్య, పొడిశెట్టి రాము, దాట్ల వీరబ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు మృతి



నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, నీటి సంఘం మాజీ చైర్మన్ గుండ్లపల్లి నాగేశ్వరరావు (62) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండి.జలీల్, నాయకులు ఎస్‌కే.సైదా, బెల్లంకొండ సత్యనారాయణ, సీతారాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, లతీఫ్‌బాబు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీధి కుక్కల బెడదను నివారించాలి


వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. విధుల్లో పిల్లలను కుక్కలు వెంబడించుతుండడంతో భయాందోళన చెందుతున్నారని, పశువుల దూడలను సైతం కుక్కలు కరుస్తున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా మఠంపల్లిలోని ఎస్సీ కాలనీ, శౌరీనగర్, జీఎస్‌రెడ్డి కాలనీ, ప్రధాన వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని సంబంధిత అదికారులు స్పందించి వీధికుక్కల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సాగర్‌కు నీటి విడుదలపై బీజేపీ నాయకుల పూజలు


శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నేరేడుచర్ల : శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్‌కు నీటి విడుదల చేయడం పట్ల సోమవారం నేరేడుచర్లలోని శివాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పార్తనబోయిన విజయ్‌కుమార్, రాచకొండ రామకోటేశ్వర్‌రావు, శంకర్‌రెడ్డి, బక్కిరెడ్డి, నాగిరెడ్డి, సురేష్, సైదులు తదితరులు ఉన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

సూర్యాపేట : కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేసి, కాంట్రాక్ట్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 31న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ ఎం. రాంబాబు ఉద్యోగులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పట్టణంలో మాట్లాడారు. కాంట్రాక్టు విభాగంలో పనిచేస్తున్న వారందరికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సవరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలన్నారు.

బత్తుల వీరయ్య మృతి బాధాకరం

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్ తండ్రి బత్తుల వీరయ్య మృతి బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన బత్తుల వీరయ్య కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, రేపాల దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ పందిరి పుల్లారెడ్డి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్, శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు రాయి రవి, అలీబాబు, లింగయ్య గౌడ్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

జనమైత్రి ఫౌండేషన్‌కు మదర్‌థెరిస్సా పురస్కారం

మిర్యాలగూడ అర్బన్: స్వచ్ఛంద సేవా సంస్థ జనమైత్రి ఫౌండేషన్‌కు ప్రతిష్టాత్మకమైన మదర్ థెరిస్సా అంతర్జాతీయ పురస్కారానికి ఎంపికైంది. సోమవారం న్యూ ఢిల్లీలోని లార్డ్ హీ రోడ్డులోని శ్రీ సత్యసాయి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ మునీర్ అహ్మద్ షరీఫ్ అందుకున్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ కె.వెంకటేషన్, కంట్రీ పొలిటిక్స్ నేషనల వీక్లీ చీఫ్ ఎడిటర్ డాక్టర్ విపిన్ గౌర్, అఖిల భారత క్షత్రియ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ రాజు మన్వేంద్ర సింగ్‌లు ఈ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందించిన నిర్వాహకులకు మునీర్ కృతజ్ఞతలు తెలిపారు.

పల్లె ప్రకృతి వనం.. పరిశుభ్రం


రెడ్లకుంటలో పల్లె ప్రకృతి వనాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కోదాడరూరల్ : మండల పరిధిలోని రెడ్లకుంటలో గల పల్లె ప్రకృతి వనం గడ్డి, కలుపుతో అధ్వానంగా మారింది. దీంతో సాక్షి పత్రికలో 'పల్లెప్రకృతి వనాలపై పట్టింపేదీ' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. గత రెండు రోజులుగా పీపీవీలో గడ్డిని, కలుపు తొలగించే పనులు చేపట్టారు. పల్లెప్రకృతి వనంలో ఎలాంటి కలుపు లేకుండా శుభ్రం చేయిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కాసాని వెంకటేశ్వర్లు

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన ఆత్కూరి హనుమంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని దశదిన కార్యక్రమాలకు స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు కాసాని వెంకటేశ్వర్లు సోమవారం రూ.10వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఆత్కూరి శ్రీనివాసరావు, పెద్దారపు సైదులు, తెల్లగోర్ల కొండా, వెల్లుట్ల వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఎడమకాలువకు నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న మేదరమెట్ల వెంకటేశ్వరరావు

మునగాల : సాగర్ ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరావు కోరారు. సోమవారం మునగాల మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమ కాలువలో అంతర్భాగమైన ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాలని, లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శంభయ్య, నందిగామ సైదులు, ఎం.సైదులు, లింగయ్య, వెంకన్న, బ్రహ్మం, సైదులు, గురుమూర్తి, శేషగిరి, హుస్సేన్, నాగరాజు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ

భానుపురి : ఆగస్టు 9న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి కృష్ణ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి పది సంవత్సరాలుగా బీజేపీ మొండి చేయి చూపుతుందన్నారు. మాదిగలకు ఉచిత హామీలు ఇస్తూ ఓట్లు దండుకుంటుందని తెలిపారు. అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత సైదులు, సురేష్, లింగయ్య, వెంకన్న, నాగార్జున, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్


సమావేశంలో మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో కార్మికులు, నిరుపేదలకు ఎలాంటి ఉపయోగం లేదని, కేవలం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని హనుమాన్ లింగయ్య భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని పదేపదే చెప్పిన్న బీజేపీ ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో మాత్రం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని అధికార యంత్రాంగా స్పందించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లావుల రాములు, సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, ధనరాజ్‌రెడ్డి, రమేష్, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ రూరల్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వచ్చే నెల 6న తలపెట్టిన దీక్ష కరపత్రాన్ని సోమవారం కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి మాదిగలను మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో పోరాడాలన్నారు. కార్యక్రమంలో పోలంపల్లి శ్రీను, గంధం రంగయ్య, కాంపాటి శ్రీను, చీమ శ్రీను, సిద్దెల రాంబాబు, రామారావు, లాజర్, రాజు, నరేష్, శాంతయ్య, రఘు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల తీరు మారాలి


మాట్లాడుతున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయుల పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల తీరు మారాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మారం శ్రీనివాస్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్‌లు కోరారు. సోమవారం మిర్యాలగూడలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు చేస్తున్న తప్పిదాలు సరి చేయాల్సిన తల్లిదండ్రులు పట్టించుకోకపోగా సరి చేసే క్రమంలో ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల వేషధారణ, వ్యవహార శైలీ ఉపాధ్యాయులను ఆందోళన కలిగిస్తుందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు శిరీషాను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు నెలల నుంచి కటింగ్ విషయంలో హెచ్చరిస్తున్న అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు పెడచెవిన పెట్టారన్నారు. ఈ సమావేశంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, సురేందర్‌రెడ్డి, ముత్యాలు, మక్లానాయక్, జయరాజు తదితరులున్నారు.

రంగస్థల నటులకు సన్మానం


రంగస్థల నటుడు వల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మను సన్మానిస్తున్న నిర్వాహకులు


పులి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మిర్యాలగూడ అర్బన్ : నాటక రంగంలో విశేష సేవలందించిన పట్టణానికి చెందిన కళాకారులు పులి కృష్ణమూర్తిశర్మ, వల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మ లను సోమవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాననభలో శివాని ఆర్ట్స్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. రంగస్థల నటులకు ప్రేక్షకుల చప్పట్లే వెలకట్టలేని అవార్డులతో సమానమన్నారు. గత 45 ఏళ్లుగా నాటకరంగంలో వివిధ పాత్రలను పోషిస్తూ ఆ పాత్రలకు రూపాన్ని అందిస్తూ సాంస్కృతిక పద్య, సాంఘిక నాటికలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్న రంగస్థల నటులను సన్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమని లీలావతి, శివాని వ్యవస్థాపక అధ్యక్షులు బాపనపల్లి పరమేష్, తడకమళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు


కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జున

మిర్యాలగూడ అర్బన్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ నాగార్జున అన్నారు. సోమవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే పది మందిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మద్యం వల్ల కలిగే నష్టాలు వారికి వివరించి కౌన్సిలంగ్ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, రాత్రి సమయంలో రోడ్లపై మద్యం మత్తులో హల్‌చల్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు క్రిష్ణయ్య, మొహన్ తదితరులున్నారు.

గదిలో బెంచీలు.. వరండాలో చిన్నారులు!


మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిననూతన గదిలో ఉంచిన బెంచీలు


నూతన భవనం వరండాలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

- శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం
- ఎంపీపీఎస్ నూతన భవనం వరండాలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ
- బెంచీలు భద్రపరిచిన నూతన గదిని తమకు కేటాయించాలని వేడుకోలు


శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గల అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో పాఠశాల అక్కడ ఊరు– మన బడి కింద నూతనంగా నిర్మించిన గది వరండాలో 20 మంది చిన్నారులతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మించిన గదిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించాలని అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ టీచర్ చెబుతున్నారు. అయితే మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు 10 మంది విద్యార్థులే వస్తున్నారు. వారికి పాఠశాల ఆవరణలోని మరో భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ భవనంలో కూడా గదులు ఖాళీగా ఉన్నాయి. అయితే నూతనంగా నిర్మించిన గదిలో మన ఊరు– మన బడి పథకం కింద మంజూరైన బెంచీలు ఉంచారు. ఆ బెంచీలను ఖాళీగా ఉన్న గదిలో వేస్తే నూతన గదిని తాము ఉపయోగించుకుంటామని అంగన్‌వాడీ అధికారులు అంటున్నారు. ఈ విషయంపై అంగన్‌వాడీ అధికారులు, గ్రామస్తులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కోరినా ప్రయోజనం లేదని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చిన్నారులకు గది కేటాయించాలని కోరుతున్నారు.